కార్పొరేషన్‌లో డిఇలకు గదుల కొరత

విధుల నిర్వహణలో ఇబ్బంది - ఖాళీ కంప్యూటర్ల కోసం వెతుకులాట

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇద్దరు డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఛాంబర్లు లేక సీట్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లో ఆరుగురు డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉన్నారు. వీరిలో ముగ్గురికి గదులు కేటాయించారు. వాటర్ వర్క్స్ డిఇకి కొత్త భవనంలో ప్రత్యేకంగా ఒక గది ఉంది. అయితే బదిలీపై వచ్చిన ముగ్గురు డిఇల్లో ఒకరు ప్రత్యేకంగా ఒక గదిని తీసుకుని కంప్యూటర్‌తో సహా ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగినులను బయటకు పంపి విధులు నిర్వహిస్తున్నారు. సహోద్యోగులైన డిఇలు ఇద్దరికీ అవసరమైన గదుల కేటాయింపుపై చొరవ చూపకపోవడంతో ఖాళీగా ఉన్న సమయంలో ఎస్ఇ, ఇఇ ఛాంబర్లలో కూర్చొని పని చేసుకోవాల్సి వస్తోంది. విధుల కేటాయింపులో చూపిన శ్రద్ధను, ఛాంబర్ల కేటాయింపులో చూపకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇదిలా ఉండగా ఆఫీసు నిర్వహణ బాధ్యతలు నిర్వహించే డిఇ దాక్షాయిని తన గదిలో ఆమెకు కేటాయించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కంప్యూటర్‌తో సహా మరోరూమ్‌లోకి తరలించింది. ఆమె గదిలో తానొక్కతే కూర్చొని ఉండగా మరోవైపు అమృత స్కీం కింద విధులు నిర్వహించే ఆడిటర్ రమేష్‌కు ప్రత్యేకంగా టేబుల్ సీటు కేటాయించాలని పట్టుపట్టారు. దీంతో ఆయన గదిలోనే తన అవుట్‌సోర్సింగ్ వర్కర్లను, కంప్యూటర్ స్కానింగ్, ప్రింటర్‌తో సహా ఆడిటర్ గదికి తరలించారు. ఇలా ఎవరికి వారు సామ్రాజ్యాలుగా ఛాంబర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇతర డీఈలకు సీట్లు లభ్యం కాని పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విభాగాధికారి తన విభాగంలో జరుగుతున్న అధికారుల ఒంటెత్తు పోకడలను గుర్తించి అడ్డుకట్ట వేయాల్సింది పోయి తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం దిగువస్థాయి సిబ్బందికి ఇబ్బందికరంగా మారిందని గుసగుసలాడుతున్నారు. ఈ అంశంపై పలువురు కార్పొరేటర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం ఆఫీసు నిర్వహణ డిఇకి ఆదేశించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్పందించి డిఇలకు ఛాంబర్లను కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

కదిరిలో ర్యాలీ చేస్తున్న సిపిఎం శ్రేణులు

సిపిఎం ప్రజారక్షణభేరికి
అపూర్వ స్పందన..!

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి యాత్రకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. బుధవారం ప్రారంభం అయిన యాత్ర గురు, శుక్రవారాల్లో మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో కొనసాగింది. యాత్ర వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు ఇలా అన్ని వర్గాల వారూ వారి సమస్యలను యాత్ర బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. బస్సుయాత్ర నాయకత్వం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో స్థానిక సమస్యలను వివరిస్తూ, ప్రభుత్వాలు చేసిన మోసాన్ని తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ప్రభుత్వాలు చేస్తున్న మోసం వాస్తవమేనంటూ వారి అభిప్రాయాలను తెలియజేశారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సిపిఎం ప్రజారక్షణభేరి బస్సుయాత్ర బుధవారం సాయంత్రం అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో ప్రవేశించింది. శుక్రవారం కదిరితో ముగిసి అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించింది. మూడు రోజుల పాటు సాగిన ఈ యాత్ర ఎనిమిది నియోజకవర్గాల్లో సాగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గపూర్ నేతృత్వంలో సాగిన యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, దయా రమాదేవి, శివనాగవేణి, భాస్కరయ్యలు పాల్గొన్నారు. యాత్రలో ప్రధానంగా రాయలసీమ ప్రాంతం వెనుకబాటు కారణాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నంతో సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాభివృద్ధికి ఇచ్చిన హామీల అమలు ఎంత వరకు వచ్చాయన్నది ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. రాయదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్న కుదురేముఖ్, హంద్రీనీవా వెడల్పు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ తదితర అంశాలను ఈ పర్యటనలో ప్రజల ముందు ఉంచారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో అనేక మంది నిరుపేదలు ఇళ్ల కోసం ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారన్నది యాత్ర బృందం ప్రస్తావించింది. గార్లదిన్నె మండలం కల్లూరులో నాలుగు సంవత్సరాలుగా ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేయడాన్ని తప్పుబట్టింది. అదే సమయంలో ఆ ప్రాంతాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గపూర్ సందర్శించి, వారికి అండగా ఉంటామని భరోసానూ కల్పించారు. పెనుకొండ, చిలమత్తూరు తదితర ప్రాంతాల్లోనూ ఇళ్ల కోసం పేదలు చేస్తున్న పోరాటాన్ని బలపరిచారు. పేదల వైపు ఉంటామని చెప్పే ప్రభుత్వం ఎందుకు వారికి అండగా ఉండటం లేదని ప్రశ్నించింది. ఇక అదే సమయంలో కరువును ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చింది. తీవ్రమైన కరువు పరిస్థితుల్లో కరువు మండలాల ప్రకటనలో కొన్ని మండలాలను మినహాయించడాన్ని తప్పుబట్టింది. తాము పర్యటిస్తున్న పుట్టపర్తి, కదిరి, నల్లమాడ మండలాల్లో తీవ్రమైన కరువున్నా ఎందుకు కరువు మండలాలు ప్రకటించలేదని ప్రశ్నించింది. ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం వలసలు పోతున్న అంశాన్నీ ముందుకు తీసుకొచ్చింది. తక్షణం ఉపాధి హామీ పనులను కల్పించాలని యాత్ర బృందం ప్రస్తావించింది. కరువు నివారణ చర్యలు, ఉపాధి కల్పించే పరిశ్రమల ఆవశ్యకత , ఈ ప్రాంతాభివృద్ధికి పాలకులు తీసుకోవాల్సిన చర్యలు అన్నింటినీ ప్రజలకు వివరించి చైతన్య పరిచే ప్రయత్నం చేసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు అభివృద్ధి, ప్రజా సమస్యలు రాజకీయాల్లో ప్రధాన అజెండా కావాలని యాత్ర ఉద్దేశాన్ని ప్రజా రక్షణ భేరీ యాత్ర ప్రజలకు వివరించింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను వదలి అధికారం కోసం పోటీపడుతున్నాయన్న విషయాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేసింది. ఈ సందర్భంగా అనేక చోట్ల ప్రజల నుంచి విశేషమైన స్పందన కనిపించింది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు అనుసరిస్తున్న విధానాలు, ఈ ప్రాంతాభివృద్ధి అంశాలు ఆందరినీ ఆలోచింపజేసే విధంగా నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. బహిరంగ సభ

- ◆ ఉమ్మడి జిల్లాలో ముగిసిన బస్సుయాత్ర
- ◆ యాత్రకు పెద్దఎత్తున ప్రజల సంఘీభావం
- ◆ ఆలోచింపజేసిన నాయకుల ప్రసంగాలు
- ◆ ఉమ్మడి జిల్లా ప్రజా సమస్యలను గర్తించిన బస్సుయాత్ర నాయకత్వం
- ◆ వెనుకబాటు, కరువును ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్న నాయకులు

జరుగుతున్న ప్రాంతాల్లో సామాన్యులు కూడా ఈ అంశాలకు మద్దతుగా చర్చించుకోవడం కనిపించింది. యాత్ర బృందం దృష్టికి అనేక సమస్యలను కూడా ప్రజలు తీసుకెళ్లారు.

రాయలసీమకు అన్యాయం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

కదిరి టౌన్, నల్లమాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎం.గఫూర్ విమర్శించారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ యాత్ర ఐదవ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ప్రారంభమైన యాత్ర నల్లమాడ మీదుగా కదిరికి చేరుకుంది. అక్కడి నుంచి అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు వెళ్లింది. కదిరి, నల్లమాడలో నిర్వహించిన సభల్లో సిపిఎం నాయకులు ప్రసంగించారు. కదిరిలో గఫూర్ మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, అనంతపురం జిల్లాకు హంద్రీనీవా తీసుకొస్తామని, రాయదుర్గం వద్ద కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, చిత్తూరులో బెల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, కర్నూలులో డిఫెన్సు ఫ్యాక్టరీ పెడతామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇందులో ఏ ఒక్క హామీని అమలు జరపకుండా మోసం చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాద బిజెపి చెర నుంచి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం వంద లక్షల కోట్లు అప్పులు చేసి మరీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన రాయలసీమ ప్రాంత ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నల్లమాడలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో సిపిఎం ప్రజా సమస్యలపైన నిరంతర పోరాటం సాగిస్తోందన్నారు. సబ్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలకు కేంద్రం ప్రకటించిన మేరకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 తేదీన సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నల్లమాడలో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులుప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య

సిఐ నరేందర్ రెడ్డిపై విచారణ

కల్లూరు ఇళ్లు కూల్చివేత సమయంలో అతిగా ప్రవర్తించిన సిఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో బుధవారం నాడు పేదల ఇళ్లు కూల్చివేసిన సందర్భంగా ఇటుకలపల్లి సిఐ నరేందర్ రెడ్డి దళితులను కులం పేరుతో దూషించి, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌పై చేసిన దాడిపై పోలీసులు విచారణ చేపట్టారు. సిఐ వ్యవహరించిన తీరుపై డిజిపి, డిఐజిలకు సిపిఎం ఫిర్యాదు చేసింది. ఇదే విషయంపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్.ఎం.బాషా, లాయర్స్ యూనియన్ నాయకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాంభూపాల్ గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో గురువారం నాడు ఈ ఘటనపై కేసు పెట్టారు. వీటన్నింటి నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సిఐ నరేందర్ రెడ్డిపై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఎఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం నాడు రాంభూపాల్‌తో ఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. తనతోపాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, మండల నాయకులు నల్లప్పలను సిఐ దూషించిన విషయాన్ని రాంభూకపాల్ ఏఎస్పీకి వివరించారు. విచారణ మొత్తాన్ని ఎఎస్పీ రాతపూర్వకంగా తీసుకున్నారు. తన 32 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ అధికారిపై ఫిర్యాదు చేసిన సందర్భం లేదని, మొట్టమొదటిసారి ఈ రకమైన ఫిర్యాదు చేసే పరిస్థితి వచ్చిందని, ఇందుకు వైసిపి నాయకులే కారణమని రాంభూపాల్ అన్నారు. గుడిసెల కూల్చివేత సందర్భంగా ఉదయం కల్లూరు కు చేరుకున్న తనను చూసిన పేదలు చుట్టూ చేరడానికి ప్రయత్నించి వారి కష్టాన్ని తెలిపారన్నారు. ఈ సమయంలో అధికారులు మనుషులమనే కనికరం లేకుండా గుడిసెలను జెసిబిలతో కూల్చివేశారన్నారు. ఇళ్లను కూల్చొద్దని అధికారులతో మాట్లాడదామని తమ పార్టీ కార్యకర్తలతో చెబుతుండగా వెనుక నుంచి వచ్చిన సిఐ నరేందర్ రెడ్డి 'ఎవరితో మాట్లాడతావ్ రా.. ఎవరికి కనికరం లేదురా'.. అంటూ మెడపై కొట్టారన్నారు. దీన్ని చూసి పక్కనున్న పోలీసు కానిస్టేబుళ్లు ముగ్గురు తన వీపుపై పిడుగుద్దులు గుద్దారన్నారు. ఇంతలో గార్లదిన్నె ఎస్ఐ తనను విడిపించి ఈయన సిపిఎం జిల్లా కార్యదర్శి అని సిఐకి చెప్పారన్నారు. అయినప్పటికీ ఎవడైతే నాకేమీ ఈ నా కొడుకును లోపల వేయండి అని కానిస్టేబుళ్లతో షర్ట్ పట్టి లాగించాడన్నారు. తనకు అడ్డుగా వచ్చిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, ఇల్లూరు నల్లప్పలను కులం పేరుతో 'మాదిగ నాకొడుకులు ఎక్కడ స్థలాలు ఉంటే అక్కడేసుకుంటారా' అంటూ సిఐ అందరూ చూస్తుండగానే అవమానించాడని తెలిపారు. అత్యంత అనాగరికంగా దురంహంకారంతో ప్రవర్తించిన సిఐపై కఠిన చర్యలు తీసుకుని పేదల ఆత్మగౌరవాన్ని కాపాడాలని రాంభూపాల్ ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

దీపావళికి బెంగళూరు-బీజాపూర్ ప్రత్యేక రైలు

ప్రజాశక్తి-రాయదుర్గం

దీపావళి పండుగ పురస్కరించుకుని ప్రయాణికుల రాకపోకలకు వీలుగా రాయదుర్గం మీదుగా నైరుతి రైల్వే బెంగళూరు–బీజాపూర్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మనీష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక రైలు ఎస్ఎంవి టెర్మినల్(బెంగళూరు)లో బయల్దేరి రాయదుర్గం, తదితర స్టేషన్ల మీదుగా 11వ తేదీ ఉదయం 10:55 గంటలకు బీజాపూర్ చేరుతుందన్నారు. ఇదే రైలు తిరిగి 14వ తేదీ సాయంత్రం 4:40 గంటలకు బీజాపూర్‌లో బయల్దేరి అదే మార్గంలో ప్రయాణించి 15వ తేదీ ఉదయం 9:30కు బెంగళూరు చేరుతుందన్నారు. ఎస్ఎంవి టెర్మినల్ (బెంగళూరు)లో బయల్దేరిన రైలు 11వ తేదీ తెల్లవారుజామున 2–20 గంటలకు రాయదుర్గం చేరుతుందన్నారు. బీజాపూర్‌లో బయల్దేరే రైలు 15వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు రాయదుర్గం రైల్వే స్టేషన్‌కు చేరుతుంద న్నారు. ప్రత్యేక రైలు సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉరవకొండ

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దార్థ్, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధాకర్, నియోజకవర్గం అధ్యక్షుడు భరత్, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు భీమేష్ మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రధానం మోదీ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ కుటుంబాల పోషణకు ఆసరాగా నిలుస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమలను కార్పొరేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టే యోచనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. మరోపక్క విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముఖ్యంగా రాయలసీమలోని కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నవంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కావున బంద్‌కు జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ పట్టణ ఎస్ఎఫ్ఐ నాయకులు హిరణ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు బాధితుల కోసం ఐక్య పోరాటం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

- ◆ అధికారంతో పేదలకు అన్యాయం చేస్తే సహించం
- ◆ నేడు కలెక్టర్, ఎస్పీలకు వినతి
- ◆ 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ◆ అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో గుడిసెలు తొలగించిన పేదలందరికీ న్యాయం జరిగేంత వరకు ఐక్యంగా పోరాడుదామని అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పిలుపునిచ్చారు. కల్లూరు గ్రామంలో గుడిసెలు తొలగించిన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, మైనార్టీ సెల్ నాయకులు జెఎం.బాషా, ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి అధ్యక్షులు సాకే శ్రీహరి, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, పుల్లప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కల్లూరు గ్రామంలో దాదాపుగా ఉన్న ఇళ్ల స్థలాలన్నీ లక్ష్మీ నరసింహస్వామి దేవుని మాన్యం భూములే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు స్టేడియం, పాఠశాల నిర్మాణానికి భూముల కేటాయింపు జరిగిందన్నారు. ఆ భూముల్లో నేడు ఇళ్ల నిర్మాణాలు జరిగాయని తెలిపారు. ధనవంతులు, పలుకుబడి ఉన్నవారందరూ ఇళ్లు నిర్మించుకోవడం, ఆక్రమించు కోవడం జరిగిందన్నారు. వాళ్లెవరినీ పట్టించు కోకుండా సెంటు స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అత్యంత దుర్మార్గం అన్నారు. పేదల పక్షాన ప్రశ్నించడానికి వెళ్లిన సిపిఎం నాయకులపై సిఐ నరేంద్రరెడ్డి చేయిచేసుకోవడం హేయమైన చర్య అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా కమ్యూనిస్టు పార్టీలు, నాయకులు పని చేస్తారనే విషయాన్ని వారు తెలుసుకోవాలని సూచించారు. సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న మాట్లాడుతూ పోలీసులే రౌడీల్లగా వ్యవహరించి పేదల గుడిసెలు తొలగించడం దుర్మార్గంగా ఉందన్నారు. గుడిసెల తొలగింపు అప్రజాస్వామిక చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ నరేంద్ర రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ కల్లూరులో గుడిసెలు వేసుకున్న వారంతా దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పేదలే అన్నారు. వారికి నిలువ నీడ లేకుండా చేయడం సభ్య సమాజం తల దించుకునేలా ఉందన్నారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఆదేశిస్తే పోలీసులు ఇష్టారాజ్యంగా పేదలపై అధికారం దుర్వినియోగం పాల్పడటం సరికాదన్నారు. ప్రజలు తిరుగుబాటు మొదలుపెట్టి గుడ్డలూడదీసి కొట్టే పరిస్థితిని పోలీసులు తెచ్చుకోవద్దన్నారు. టిడిపి మైనార్టీ నాయకులు జెఎం.బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పే మాటలకు క్షేత్ర స్థాయిలో అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి ఛైర్మన్ సాకే శ్రీహరి మాట్లాడుతూ అనంతపురం నగరం అభివృద్ధి జరిగిందంటే కమ్యూనిస్టు పార్టీలు నగరానికి చుట్టు పేదలతో కాలనీ ఏర్పాటు చేయడంతోనే సాధ్యమైందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గం భూ కబ్జాల పరంపర నిత్యం కొనసాగుతోందన్నారు. పేరుకు దళిత ఎమ్మెల్యే అయినప్పటికీ వారి కుటుంబ సభ్యులు అగ్రవర్ణాల వారు కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించరాదని హైకోర్టు తీర్పు ఉన్నా వాటిని భేఖాతరు చేస్తూ పోలీసులు, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు గుడిసెలు తొలగించారని తెలిపారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు దేవాదాయ శాఖ, పోలీసులు, రెవెన్యూ అధికారులు వ్యవహరించి పేదలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఆలయ భూములను వైసిపి నాయకులు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముతుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అక్కడ అన్యాక్రాంతం అయిన భూములన్నీ ఖాళీ చేయించే దమ్ము అధికారులకు ఉందాని ప్రశ్నించారు. సిఐ నరేంద్రరెడ్డి తమ పట్ల దుర్మార్గంగా వ్యవహరించి, కులం పేర్లతో దూషించి దాడి చేశాడన్నారు. ఆ అధికారిని సస్పెండ్ చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. కల్లూరులో బాధిత పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్‌లను కలిసి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఈ నెల 9వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, పాల్గొన్నారు.

పంటలు పూర్తయ్యే వరకూ నీరివ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

హెచ్ఎల్‌సి, జిబిసిల కింద పంటలు సాగు చేసిన రైతులను దృష్టిలో ఉంచుకుని పంటలు చేతికొచ్చే వరకూ నీరు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈనెల 10వ తేదీన నీటి విడుదలను నిలుపుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం విజయవాడలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని హెచ్ఎల్‌సి, జిబిసిల కింద అనేకమంది రైతులు వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మిరప, తదితర పంటలను సాగు చేశారన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఈనేపథ్యంలో అధికారులు నీటిని బంద్ చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఇందుకు తుంగభద్ర నుంచి ఆదనపు నీటిని తెచ్చే తేవాలని కోరారు. కుదరని పక్షంలో ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిలోనైనా డిసెంబర్ ఆఖరు వరకూ నీరు విడుదల చేయించాలని విన్నవించారు. ఇకపోతే ఉరవకొండ నియోజకవర్గంలో కేవలం నాలుగు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. తక్కువ వర్షపాతం నమోదైన బెలుగుప్పను కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు నుంచి తాడిపత్రికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రహదారిలోని గుంతలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, సహాయ కార్యదర్శి వెంకటచౌదరి మాట్లాడుతూ పుట్లూరు నుంచి తాడిపత్రి వెళ్లే దారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణిస్తున్నప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని వెంటనే గుంతలను పూడ్చాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

'ఆరోగ్య సురక్ష'తో ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అదేబాటలో తనయుడు జగన్ నడుస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగు పరుస్తున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ చేయాలన్న సదుద్దేశంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని దోచుకుంటే, జగన్ వచ్చాక సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, ఇషాక్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-గార్లదిన్నె

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాత కల్లూరు, ఎగ్గుపల్లి గ్రామాల్లో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. ప్రజలందరూ వైసిపి ప్రభుత్వ పాలనకు, గత టిడిపి ప్రభుత్వ పాలనకు తేడా చూడాలన్నారు. ఓటమి భయంతోనే ప్రతిపక్షాలు వైసిపి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకట్ నారాయణ, మాజీ ఎంపిపి ప్రదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నారాయణరెడ్డి, పిల్లల రామకృష్ణ, చీమల కేశవయ్య, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి : డిఐజి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులతోపాటు యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని డిఐజి అమ్మిరెడ్డి సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో పాఠకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయాల్లో ఎంతో విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇందుకు గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డిని అభినందించారు. గ్రంథాలయలకు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వచ్చి సేవలను ఉపయోగించు కోవాలన్నారు. ఆలాగే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ప్రతి గ్రంథాయలంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ, మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మీనాక్షి ఫౌండేషన్ రమణ, ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, పాలకులు పాల్గొన్నారు.

రక్షకతడులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-నార్పల

ప్రస్తుతం బెట్ట పరిస్థితుల్లో కంది, ఆముదం పంటలకు రక్షక తడులు ఇవ్వడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నిలువురాయి గ్రామంలో వర్షాధారంగా కింద రైతులు సాగు చేసిన ఆముదం, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఏర్పడిన బెట్ట పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఇలాంటి సమయంలో రైతులు ఒక రక్షకతడి ఇచ్చినట్లయితే పంటను బెట్ట నుంచి కాపాడి అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో శాస్త్రవేత్తలు సహజ దేవా, సిహెచ్ అప్పారావు, ఇంజనీరింగ్ విభాగం పవన్‌కుమార్‌రెడ్డి, చావులూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విప్ కాపు

రాయదుర్గం : పట్టణంలోని 21వ వార్డు కౌన్సిలర్ డిష్ గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 లక్షల వ్యయంతో స్థానిక మొలకల్మూరు రోడ్డులోని నర్సోజీకుంటలో డ్రెయినేజీ పనులకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోవింద రాజులు, అజయ్‌కుమార్, వన్నూరుస్వామి, షబ్బీర్, మంజునాథ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి.సిద్ధప్ప, పట్టణ అధ్యక్షుడు అరవా శివప్ప, ఇన్‌ఛార్జులు రామాంజనేయులు, బషీర్, సత్యనారాయణ, నాయకులు పవన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండా ఉపాధి పనులా..?

మండల్ మీట్‌లో ప్రశ్నించిన సర్పంచి

గుత్తి : పంచాయతీ తీర్మానం లేకుండా ఉపాధి హామీ పథకం పనులు ఎలా కల్పిస్తారని ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ఎపిఒ మద్దిలేటి మాట్లాడుతుండగా మండలంలోని ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్‌కుమార్ అడ్డుకున్నారు. తన అనుమతి లేకుండా ఉపాధి పనులు ఎలా చేస్తారని నిలదీశారు. గ్రామంలో రూ.26 లక్షలు ఉపాధి హామీ పనులకు నిధులు మంజూరైతే రూ.4 లక్షలు మాత్రమే పనులు చేశారన్నారు. మిగతా సొమ్ము అధికారులు స్వాహా చేశారని ఆరోపించారు. తమ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివాజీరెడ్డి, వైస్ ఎంపిపి నాగేశ్వరమ్మ, ఎఒ ముస్తాక్‌అహ్మద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన

ప్రజాశక్తి-గుంతకల్లు/గుంతకల్లు రూరల్

పట్టణంలోని టిటిడి కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఎం.గౌతమి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఇందులో భాగంగా దాదాపు 300కుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 14వ తేదీ వరకూ మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కాని మండలాల్లో రెండు మండలాలను ఒక యూనిట్‌గా తీసుకుంటూ అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయం, మున్సిపాలిటీ కార్యాలయం, రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయాలు ఉన్నా ఇంతమంది సమస్యలతో వచ్చారంటే ప్రజల్లో చైతన్యం వచ్చినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిపిఎం వినతి

పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాని కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సిపిఎం అనుబంధ పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాల్లో ఏర్పడిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా 40ఏళ్ల నుంచి వివిధ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు అక్కడే పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వాసుపత్రి వద్ద కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరుల సంఘం కన్వీనర్ మారుతీప్రసాద్, చంద్రశేఖర్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గౌతమికి సమస్యలను వివరిస్తున్న సిపిఎం నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీల అమలులో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాదయాత్రను సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆస్తి, చెత్త పనులు, విద్యుత్ ఛార్జీలు, వంట గ్యాస్, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగిపోయాయన్నారు. ఇవి చాలవన్నట్లు రకరకాల పన్నులు భారాలు ప్రజలపై మోపారన్నారు. కావున పట్టణంలో మూతబడిన స్పిన్నింగ్ తెరిపించి టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కరువు పనులు కల్పించాలన్నారు. ఇకపోతే రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయన్నారు. పిల్ల కాలువలు తవ్వి రాగులుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందిస్తే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. తద్వారా సాగు, తాగునీరు అందుతుందన్నారు. ఆయా సమస్యలపై అనేకసార్లు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు, పాదయాత్రలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పాదయాత్ర ఈనెల 6న ముగించి 7న మున్సిపల్ కార్యాలయం ముందు బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు హెచ్ఎం మారుతీప్రసాద్, సాకే నాగరాజు, బి.రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, బి.చంద్రశేఖర్, ఎస్.అబ్దుల్లా, డి.చరణ్‌కుమార్, బి.జ్యోతి, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, చెర్రి, డివైఎఫ్ఐ నాయకులు మద్దికేరి ప్రతాప్, చిన్నా, ఆవాజ్ నాయకులు షాషావలి, మస్తాన్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసులు

సామాన్యులకు చేరువలో 'రియా'

డాక్టర్ ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించే ఆకాంక్షతో నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత రజనీ కాంప్లెక్స్‌లో రియా ఆసుపత్రిని ప్రారంభించినట్లు వైద్యులు ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తమ తండ్రి లక్ష్మీప్రసాద్ జిల్లా ప్రజలకు సుపరిచితులన్నారు. ఆయన ఆకాంక్ష మేరకు జిల్లాలోని ప్రజలకు తమ సేవ అందించాలని ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ సేవలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అక్టోబర్ 27న ఆర్డీటీ డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆసుపత్రిని ప్రారంభించినట్లు వివరించారు. ప్రారంభోత్సవం సందర్భంగా వారం రోజులపాటు ఉచితంగా ఓపి సేవలను అందించాలనే సంకల్పంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ సౌకర్యం లేదని, డే కేర్ సౌకర్యంతో చికిత్స అందిస్తున్నామని, త్వరలో మరింత ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ జనరల్ సర్జరీ డాక్టర్ గీతా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఆసుపత్రిలో బిపి, షుగర్, థైరాయిడ్, గుండె, కిడ్నీ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు, జ్వరాలు, టిబి, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, రొమ్ములో గడ్డలు, ఫైల్స్, ఫిస్టులా, హెర్నియా, కాలిన గాయాలు, పుండ్లు, కణతులు వంటి సమస్యలకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సొంత జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

రియా ఆసుపత్రి, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ గీతా

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తున్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తాగునీటి పథకానికి సంబం ధించిన కణేకల్లు పట్టణ శివారులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుక్రవారం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సందర్శించారు. ఈ నెలాఖరులో తుంగభద్ర ఎగువ కాలువ నుంచి సరఫరా అవుతున్న నీరు బంద్ అవుతున్న తరుణంలో నీటి కొరత ఏర్పడకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డిని కోరారు. నీటి నిల్వ, పంపింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెంటనే చేపట్టాల్సిన పనులపై కమిషనర్‌తో చర్చించారు. ఎమ్మెల్యే వెంట కణేకల్లు మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల్లో టిడిపితోపాటు అధినేత చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే సిఎం జగన్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్ రాణీనగర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ–బాబు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రూ.120 కోట్లతో 12 రిజర్వాయర్లు నిర్మించి 20 సంవత్సరాల దాకా నీటి సమస్య రాకుండా చేశామన్నారు. అలాగే నగరంలో రోడ్లను నిర్మించి నగర రూపురేఖలు మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీకుమార్‌గౌడ్, ఆదినారాయణ, దేవళ్ల మురళి, బంగి నాగ, గుర్రం నాగభూషణ, గోపాల్‌గౌడ్, బోయపాటి బాలప్ప, జెఎం.బాషా, రాప్తాడు రంగా, దలవాయి వెంకటనారాయణ, పోతుల లక్ష్మీనరసింహులు, సుధాకర్‌యాదవ్, రంగనాయకులు, అజీబ్, బాబు, సాకే వెంకటేష్, పావురాల శేఖర్, బొమ్మినేని శివ, కుళ్లాయప్ప, బాబా ఫక్రుద్దీన్, మదన్, బన్నీ, సృజన్, అజీమ్, మహిళలు విజయశ్రీరెడ్డి, తేజస్విని, జానకి, శంకరమ్మ, కృష్ణవేణి, నూర్జహాన్, దేవి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : వచ్చే ఎన్నికల్లో టిడిపి భారీ మెజార్టీతో గెలుస్తుందని భావించిన సిఎం జగన్ టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తురకపల్లి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు రావాల్సిందే అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆర్. హరినాథ్ గౌడ్, మండల పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్‌గౌడ్, టౌన్‌బ్యాంకు అధ్యక్షులు అబ్దుల్ జిలాన్, డైరెక్టర్ వీరన్న, జిల్లా నాయకులు పి.శ్రీకాంత్‌చౌదరి, మాజీ ఎంపిపి వీరేష్, నాయకులు దిల్కాశీనా, నాగేశ్వరరావు, ఈరన్న, రమేష్, రాముడు, సుధాకర్, అగ్గిరాముడు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండలంలోని ఇల్లూరు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశవరెడ్డి, గేట్ కృష్ణారెడ్డి, ఇల్లూరు రామాంజనేయులు, సుంక, వన్నూరు, వెంకటేష్, జగదీష్, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'లో నాయకులు

అనంతపురంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి


గార్లదిన్నె మండలం ఇల్లూరులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

24 గంటల్లో హత్యకేసు ఛేదింపు

ఉరవకొండ : కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని ఓ వెంచర్ వద్ద చోటు చేసుకున్న వాచ్‌మెన్ హత్యకేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలోని ఓ వెంచర్‌లో గురువారం తెల్లవారుజామున వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నారాయణప్ప హత్యకు గురయ్యాడు. నారాయణప్ప పక్క వెంచర్‌లో పని చేస్తున్న మరో వాచ్‌మెన్ హనుమంతప్ప భార్యతో నారాయణప్ప వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీన్ని భరించలేని హనుమంతప్ప తన స్నేహితుడు రామచంద్రయ్యతో కలిసి పథకం ప్రకారం నిద్రలో ఉన్న నారాయణప్ప తలపై కర్రతో కొట్టి హతమార్చారు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, డాగ్ స్క్వాడ్ సాయంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, ముగ్గురు కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

పట్టపగలే చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని గోపురాజుపల్లి ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దన్న ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు పెద్దన్న వివరాల మేరకు ఇంట్లో గ్యాస్ అయిపోవడంతో తన కూతురిని డబ్బులు తీసుకురమ్మని బీరువా వద్దకు పంపగా బీరువాను పగులగొట్టినట్లు గమనించిందన్నారు. వెంటనే వెళ్లి పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువాను పగులగొట్టి అందులోని రూ.30వేల నగదు, జత కమ్మలు, మాటీలు చోరీ గురైనట్లు వాపోయాడు. వెంటనే సీఐ సుబ్రమణ్యంకు సమాచారం ఇవ్వగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఉరవకొండ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డొనేకల్, విడపనకల్ కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టును డీఎస్పీ నర్సింగప్ప శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం, డబ్బులు రవాణా జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ ఎస్ఐ తిప్పయ్యనాయక్, సెబ్ ఎస్ఐ జయనరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాయిద్యపరికరం అందజేత

పుట్లూరు : భూమిరెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా భజన కళాకారులకు శుక్రవారం హార్మోనియం అందజేశారు. ఈమేరకు స్థానిక రామాలయంలో భూమిరెడ్డి ఫార్మర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, భూమిరెడ్డి పెద్ద నారాయణరెడ్డి కలిసి సుమారు రూ.70 వేలు విలువజేసే హార్మోనియాన్ని భజన కళాకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.గూడూరు ఎంపిటిసి భూమిరెడ్డి గారి నాగార్జునరెడ్డి, భజన కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నరికిన చీనీ చెట్ల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని గరుగుచింతలపల్లి గ్రామంలో గత మంగళవారం ఓబుళయ్యకు చెందిన చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరకడంతో విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ఓబుళయ్యను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భయాందోళన చెందవద్దని అండగా ఉంటామని రైతుకు భరోసా ఇచ్చారు.

బికెఎస్ సిపిఎం మండల కార్యదర్శికి మాతృవియోగం

బుక్కరాయసముద్రం : సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్పకు మాతృవియోగం కలిగింది. కుళ్లాయప్ప తల్లి గౌరమ్మ (102) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి గౌరమ్మతోపాటు పలువురు టిడిపి, సిపిఎం నాయకులు పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుళ్లాయప్పకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

7న మండల సర్వసభ్య సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన ఈనెల 7న మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు కోఆప్షన్ మెంబర్లు, మండల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'గురుకులం'లో సమస్యల పరిష్కారంపై హర్షం

ఉరవకొండ : పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రిన్సిపల్ నల్లపాటి సునీత, బోధనా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపల్‌తోపాటు బోధనా సిబ్బంది ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన ఎంపి తలారి రంగయ్యను కలిసి ఎంపీ నిధులను మంజూరు చేయించి సమస్యలను పరిష్కరించారు. దీంతో ఎమ్మెల్సీతోపాటు ఎంపికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

గుత్తి : రైల్వే ఇన్స్టిట్యూట్‌లో రైల్వే ఆసుపత్రి, పిపి యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, కార్మికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వే డిప్యూటీ సిపిఓ ప్రేమ్‌కుమార్, గుంతకల్లు సీనియర్ డిపిఓ చౌహాన్, వైద్యులు ప్రభావతి, విజయలక్ష్మి, మురళీమోహన్ సుధీర్, గుత్తి రైల్వే ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ ప్రమోద్, కార్యదర్శి రవికుమార్, రైల్వే కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'అమ్మ' చేయూత

శింగనమల : పేదరికంతో రోడ్డున పడిన ఓ అభాగ్య కుటుంబానికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. కుటుంబ పెద్దను కోల్పోయి గడవలేని స్థితిలో ఉన్న మండలంలోని సావిత్రి కుటుంబానికి అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శుక్రవారం ఆర్థికసాయంతోపాటు నిత్యావసర సరుకులు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. బేల్దారిగా పని చేస్తున్న సావిత్రి భర్త వీరన్న వారం క్రితం మృతిచెందాడు. దీంతో తన ముగ్గురు పిల్లలు జితేంద్ర, హర్షిత, వీరేష్‌తోపాటు వృద్ధురాలైన వీరేష్ తల్లితో కలిసి సావిత్రి నివాసం ఉంటోంది. ఈనేపథ్యంలో కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి బాధితురాలి ఇంటికి చేరుకుని ఆర్థికసాయంతోపాటు కుట్టుమిషన్ అందజేశారు.

అనువైన చోటే ఇళ్ల పట్టాలిస్తాం : వైసిపి

ఉరవకొండ : లబ్ధిదారులకు అనువైన చోట ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు తెలిపారు. పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ చేసే లేఅవుట్‌లో చేపట్టిన పనులను తహశీల్దార్ ఈరమ్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో గత కొన్ని నెలల కిందట మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 552 సర్వే నంబర్‌లో పట్టాలు పొందిన లబ్ధిదారులు శ్మశాన వాటిక పక్కనే ఉండడంతో ఇంటి నిర్మాణ చేసుకోలేమని చెప్పారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన 502, 503 సర్వే నెంబర్లలో లబ్ధిదారులకు పట్టాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టారన్నారు. వారంలోపు మట్టిని వేసి చదును చేసి అర్హులకు ఇంటిపట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.